సాక్షి ప్రకాశం

మంగళవారం । 10 । జూన్ । 2025



పాలనలో కూటమి విఫలం

గత ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కుటిల నీతిని అవలంబిస్తోందని మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు.

- 8లో..



లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలి

ప్రతి విద్యార్థి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు పట్టు విడవకుండా కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39 /28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పథకాలను పర్యవేక్షించిన కేంద్ర బృందం

- కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించిన అధికారులు
- అనంతరం క్షేత్ర స్థాయిలో పరిశీలన



పొదర్తిలో పర్యటిస్తున్న కేంద్ర బృందం

ఒంగోలు సబర్బన్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పథకాలను కేంద్రం నుంచి వచ్చిన అధికారుల బృందం సోమవారం పరిశీలించింది. తొలుత ప్రకాశం భవన్‌లో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో ఆమె ఛాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ న్యూఢిల్లీ నుంచి జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన కేంద్ర అధికారుల బృందం జిల్లాలో పర్యటించేందుకు వచ్చిందని పేర్కొన్నారు. ఈ బృందం ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు జిల్లాలో భారత ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందే అన్ని గ్రామీణాభివృద్ధి శాఖల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వచ్చారన్నారు. ఏరియా ఆఫీసర్స్ అప్లికేషన్‌లో పరిశీలనా పనులను నమోదు చేసేందుకు ఎంఓఆర్‌డీ శాఖ నుంచి ఉమేష్ కుమార్ రామ్, జాయింట్ డైరెక్టర్ (దిశ), అకౌంట్స్ ఆఫీసర్ (ఆర్‌ఎల్) ఎ.రావత్ క్షేత్ర సందర్శనకు వచ్చారని వివరించారు. అందులో భాగంగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ, జిల్లా ప్రజా పరిషత్, గ్రామీణ నీటి సరఫరా శాఖ, డీఆర్‌డీఏ, రూడ్‌సెట్, హౌసింగ్ శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ, భూగర్భ శాఖల అధికారుల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా అధికారులు బృందానికి వివరించారు. అనంతరం కొత్తపట్నం మండలంలో పొదర్తిలో పర్యటించారు.

రేషన్ వాహనాలను నడపాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు



వ్యవసాయ కార్మిక సంఘ సమావేశంలో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

ఒంగోలు టౌన్: వాహనాల ద్వారా రేషన్ బియ్యం సరఫరా చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు వాహనాల ద్వారా రేషన్ ఇస్తున్నందున రేషన్ దుకాణాలకు దూరంగా ఉన్న గ్రామాలకు చెందిన వారు ఇంటి వద్దనే రేషన్ తీసుకునేవారని తెలిపారు. ఇప్పుడు వాహనాలను రద్దు చేయడం వలన రేషన్ కోసం పనులు మానుకొని రావాల్సి వస్తుందన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ నగదు బదిలీ పథకం ఆహార భద్రతకు చేటు చేస్తుందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం ఎవరూ తినడం లేదని, బ్లాక్ మార్కెట్‌కు చేరుతున్నాయని సాకులు చెబుతున్న ప్రభుత్వం రేషన్ అక్రమాలను ఎందుకు సరి చేయడం లేదని ప్రశ్నించారు. బియ్యం అక్రమ రవాణాను, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడం చేతకాక కబుర్లు చెబుతున్నారని ధ్వజమెత్తారు. బియ్యాన్ని అక్రమ మార్గంలో సేకరించి మిల్లుల్లో పాలిష్ చేసి బహిరంగ మార్కెట్లో రూ.50 నుంచి రూ.60 కు విక్రయిస్తున్నారని తెలిపారు. ప్రజలు తినడానికి అనువైన సన్నబియ్యాన్ని సరఫరా చేస్తే ప్రతి ఒక్కరూ తప్పకుండా తింటారని చెప్పారు. గత ఏడాది బడ్జెట్లో రూ.2.12 కోట్లను కేటాయించిన ప్రభుత్వం అందులో కేవలం రూ.1.64 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా అమలైతే రైతులకు గిట్టుబాటు ధర, పేదలకు ఆహార భద్రత లభిస్తుందన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు జాలా అంజయ్య, కేజీ మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, బడుగు వెంకటేశ్వర్లు, మాల్యాద్రి, ఉబ్బా వెంకటేశ్వర్లు, వీరనారాయణ, పి.శ్రీనివాసులు, జనార్దన్, టి.ఏడుకొండలు పాల్గొన్నారు.

బేళ్ల చూపులు!

ఒక పక్క మద్దతు ధర రాక..
మరో పక్క కొనుగోళ్ల జరక్క మార్కెట్ మాయాజాలంలో చిక్కుకుని పొగాకు రైతు విలవిల్లాడుతున్నాడు. అండగా నిలవాల్సిన ప్రభుత్వం, పొగాకు బోర్డు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు సిండికేట్ అయి రైతును నట్టేట ముంచేశాయి. సాగు ఖర్చులు భారీగా పెరగడం, వేలంలో ధరలు పతనమవుతుండడంతో ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్నాడు. మద్దతు ధర కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేసినా ప్రభుత్వ పెద్దలు ప్రకటనలకు పరిమితం కావడంతో రైతు ఈ ఏడాది ఆర్థికంగా గట్టెక్కే పరిస్థితి కనిపించడంలేదు. నాలుగేళ్ల లాభాలు చూసిన రైతు నేడు నష్టాల ఊబిలో కూరుకుపోయే దుస్థితి నెలకొంది.



త్రోవగుంట పొగాకు వేలం కేంద్రంలో తిరస్కరణకు గురైన పొగాకు బేళ్లను చూసి దిగాలుగా ఉన్న రైతులు

- కొనుగోళ్లలో అంతా మాయ
- నత్తనడకన పొగాకు కొనుగోళ్లు
- మూడు నెలలు గడిచినా 26 శాతం మాత్రమే విక్రయాలు
- సిండికేట్ అయిన బయ్యర్లు
- పట్టించుకోని ప్రభుత్వం, పొగాకు బోర్డు
- ధరల కోసం రోడ్డెక్కినా కార్యరూపం దాల్చని ప్రభుత్వ పెద్దల ప్రకటనలు
- గత ఏడాది గరిష్ట ధర రూ.366 కాగా ఈ ఏడాది రూ.280కు మించని దుస్థితి

చీమకుర్తి: ప్రకాశం రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమై మూడు నెలలు దాటుతోంది. ఇప్పటి వరకూ రైతుకు ఆశించిన ధర లభించలేదు సరి కదా ఏరోజుకారోజు ధరలు పడిపోతున్నాయి. కొనుగోళ్లు సైతం నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటి వరకూ 26 శాతం కూడా కొనుగోలు చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది పొగాకు బోర్డు 104 మిలియన్ కేజీలు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే పండించిన పొగాకు 160 మిలియన్ కేజీలు ఉన్నట్లు బోర్డు అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం బోర్డు అధికార వర్గాలు చెబుతున్న దాని ప్రకారం 104 మిలియన్ కేజీలకు గాను కేవలం 43 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోళ్లు జరిగాయి. దీని ప్రకారం కొనుగోళ్లు ఎంత దారుణంగా ఉన్నాయో అవగతమవుతుంది.

రీజియన్ పరిధిలో దాదాపు 30 వేల మంది రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. 69,095 హెక్టార్లలో సాగు చేసేందుకు బోర్డు అనుమతినిచ్చింది. సాగు సమయంలో పలు కంపెనీలు హామీలు ఇవ్వడంతో రైతులు ఏకంగా 87,988 హెక్టార్లలో సాగు చేశారు. కొనుగోలు సమయం వచ్చేసరికి వ్యాపారులు మాట మార్చేశారు. ఈ ఏడాది కర్ణాటకలో వచ్చిన ధరలు, గత ఏడాది మార్కెట్లో పలికిన ధరలతో పోలిస్తే ఇక్కడ ధరలు దారుణంగా పడిపోయాయి. కొనుగోలు ప్రారంభంలో కిలో రూ.280 పలకడంతో రైతులు సంబరపడ్డారు. అప్పటికి ఇంకా కర్ణాటకలో కొనుగోళ్లు సాగుతున్నాయి. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయని ఆశపడ్డారు. రైతుల ఆశలు అడియాసలయ్యాయి.

నిండిపోతున్న కోల్డ్ స్టోరేజీలు..

మార్చి 10వ తేదీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకూ దిగుబడిలో 26 శాతం అంటే చాలా తక్కువ శాతం నమోదైంది. వేలం కేంద్రాల్లో ఆశించిన ధరలు రాకపోవడంతో రైతులు తమ సరుకుని తిరిగి కోల్డ్ స్టోరేజీలకు తరలించేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న దాదాపు అన్ని కోల్డ్ స్టోరేజీలు పొగాకు బేళ్లతో నిండిపోయాయని తెలుస్తోంది. సరుకును వేలం కేంద్రానికి తెచ్చి ధర రాక వెనక్కి తీసుకెళ్తుండడంతో బ్యారన్‌కు అదనంగా రూ.50 వేల నుంచి రూ.70 వేలు భారం పడుతుందని వాపోతున్నారు. అసలే ధరలు రాక అల్లాడుతుంటే ఇది తలకు మించిన భారంగా మారుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



త్రోవగుంట పొగాకు వేలం కేంద్రం నుంచి ట్రాక్టర్‌లో కోల్డ్ స్టోరేజీకి పొగాకు బేళ్లు తరలిస్తున్న రైతులు



టంగుటూరులో వేలం

26 శాతం కొనుగోళ్లు..

జిల్లాలో ఉన్న 11 వేలం కేంద్రాల్లో ఇప్పటి వరకు సరాసరిన 6 రౌండ్లు మాత్రమే పొగాకు కొనుగోళ్లు జరిగాయి. మరో నాలుగు నెలలు మాత్రమే విక్రయాలు జరిగే అవకాశం ఉంది. పొగాకు బోర్డు నిర్దేశించిన దాని ప్రకారం 104 మిలియన్ కేజీల్లో కేవలం 26 శాతం అంటే 43 మిలియన్ కేజీలు కొనుగోళ్లు జరిగాయి. ఇదిలా ఉండగా రైతులు ఉత్పత్తి చేసిన దాని ప్రకారం రానున్న నాలుగు నెలల్లో మిగిలిన 120 మిలియన్ కేజీలు కొనుగోలు చేయటం సాధ్యమవుతుందా...? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లక్షలకు లక్షలు పెట్టుబడి పెడితే నాలుగో వంతు పొగాకు కూడా అమ్ముడు పోకపోవడంతో పొగాకుపై పెట్టిన ఖర్చులు, కూలీల ఖర్చులు చెల్లించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

దడ పుట్టిస్తున్న ధరలు:
వేలం కేంద్రాల్లో నమోదవుతున్న ధరలు రైతుల గుండెల్లో దడపుట్టిస్తున్నాయి. రీజియన్ పరిధిలో గతేడాది కేజీ పొగాకు గరిష్ట ధర రూ.366 పలకగా, ఈ ఏడాది వేలం నాలుగు నెలలు దాటుతున్నా ఇంత వరకు గరిష్ట ధర రూ.280కు మించలేదు. బయ్యర్లు సిండికేట్ కావడంతో రైతుల వద్ద కొనుగోలు చేస్తున్న వాటిలో 10 శాతం బేళ్లకు కూడా రూ.280 ధర దక్కడం లేదు. చాలా ప్రాంతాల్లో సరాసరి ధర రూ.220 మించడం లేదని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా నాణ్యత పేరుతో ధరలు తగ్గించేస్తుండడంతో తెచ్చిన బేళ్లను వెనక్కు తీసుకెళ్లలేక వచ్చిన ధరకు తెగనమ్ముకుంటున్నారు. లోగ్రేడ్ పేరుతో గరిష్ట ధర రూ.180కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పది రోజుల వ్యవధిలో ఇలా కేజీకి రూ.20 నుంచి రూ.30 వరకూ తగ్గించేశారు. కొండపి వేలం కేంద్రంలో 5వ రౌండ్ వేలం ప్రారంభంలో కనిష్ట ధర కేజీ రూ.200 ఉండగా రౌండ్ ముగింపులోకి వచ్చేసరికి సోమవారం కనిష్ట ధర కేజీ రూ.120కు పడిపోయింది. దీంతో రైతులు ఈ రౌండ్ లో రెండుసార్లు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. పలు కొనుగోలు కేంద్రాల్లో రైతును బట్టి ధరలు నిర్ణయిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు రైతును బట్టి గ్రేడ్ ను నిర్ణయిస్తున్నారని, అలా కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారు.

సాక్షి కార్యాలయాలపై దాడులను అరికట్టాలి

ఒంగోలు టౌన్: అమరావతి రాజధాని అంశం మీద సంబంధంలేని విషయాన్ని సాక్షికి ఆపాదిస్తూ అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు కొందరు సాక్షి కార్యాలయాల మీద చేస్తున్న దాడులను అరికట్టాలని ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు సాక్షి విలేకరుల బృందం సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వినతిపత్రం అందజేసింది. ఎస్పీతో పాటుగా వన్‌టౌన్ సీఐ వై.నాగరాజుకు వినతి పత్రం అందజేసి సాక్షి కార్యాలయాలకు రక్షణ కల్పించాల్సిందిగా కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్నీ మండలాల్లోనూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాక్షి టీవీలో జరిగిన చర్చలో పాల్గొన్న ఒక పాత్రికేయుడు చేసిన వ్యాఖ్యలను వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు ఖండించారని చెప్పారు. అయినా సాక్షి పత్రికా కార్యాలయాల మీద దాడులు చేయడం, కార్యాలయాల బోర్డులను ధ్వంసం చేయడం, పత్రికలను తగలబెట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని, దాడులకు పాల్పడిన వారి మీద తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

యోగాంధ్రపై అవగాహన పెంచాలి

- కలెక్టరేట్ నుంచి మినీ స్టేడియం వరకూ ర్యాలీ నిర్వహణ



ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని అన్నీ వర్గాల ప్రజలను యోగాంధ్ర క్యాంపెయిన్లో భాగంచేసే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా యోగా ర్యాలీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన యోగా ర్యాలీని కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రారంభించారు. ఈ యోగా ర్యాలీ ఒంగోలు కలెక్టరేట్ వద్ద నుంచి మినీ స్టేడియం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలోని అన్నీ వర్గాల ప్రజలను యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంచేసే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్ రావు, బీఎన్ విజయకుమార్, ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, డీపీఓ వెంకట నాయుడు, మెప్మా పీడీ శ్రీహరి, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు, ఆయుష్ శాఖ ఆర్డీడీ పద్మజాతి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్లు



పొగాకు బోర్డులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్, బత్తుల బ్రహ్మానందరెడ్డి, అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసరెడ్డి

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి సురేష్

పొదిలి రూరల్: పొగాకు రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 11న ప్రకాశం జిల్లా పొదిలి పొగాకు బోర్డును సందర్శించనున్నారు. పొదిలిలో అందుకు సంబంధించిన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. జగనన్న పర్యటన పనులను జిల్లా పార్టీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి, కొండపి ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస రెడ్డి సోమవారం పరిశీలించారు. ముందుగా పొదిలి-దర్శి రోడ్డులోని ఎస్ఎస్ఆర్ పెట్రోల్ బంక్ వద్ద జరుగుతున్న హెలిప్యాడ్ పనులను వారు పరిశీలించారు. హెలిప్యాడ్ ప్రాంతంలో కంకర నింపి, మట్టితోలి యంత్రంతో చదును చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించడం, మట్టితోలకం, చదును చేయడం వంటి పనులు వేగంగా జరుగుతున్నాయి. కార్యక్రమానికి వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్తగా ఏఏ ప్రాంతాల్లో భోజనం, మంచినీరు ఏర్పాటు చేస్తే బాగుంటుందో పరిశీలించారు. దర్శి రోడ్డులోని మంజునాథ కళ్యాణ మండపం, ఒంగోలు రోడ్డులోని డాన్ రెస్టారెంట్, పోలీసు స్టేషన్ వద్ద, విశ్వనాథపురంలో రెండు చోట్ల భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. పొగాకు బోర్డులో రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై చర్చించుకున్నారు. వారి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు అన్నా కృష్ణచైతన్య, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, జీ శ్రీనివాసులు, సాయి రాజేశ్వరరావు, గుజ్జుల సంజీవరెడ్డి, కొత్తపులి బ్రహ్మారెడ్డి, వై వెంకటేశ్వర రావు తదితరులు ఉన్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్‌తోనే ఎస్జీటీలకు న్యాయం

- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్

ఒంగోలు సిటీ: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఎస్జీటీ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే అబ్దుల్ హై డిమాండ్ చేశారు. సోమవారం ప్రకాశం భవన్ వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరాహార దీక్షలు చేశారు. ఈ దీక్షా శిబిరాన్ని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే అబ్దుల్ హై మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. విద్యా శాఖామంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అధికారులు ఎస్జీటీలను బలవంతంగా వెబ్ కౌన్సెలింగ్ లో పాల్గొనాలని ఒత్తిడి చేస్తున్నారని, మాన్యువల్ కౌన్సెలింగ్ పెట్టాలని డిమాండ్ చేశారు. బదిలీల జాబితాలో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని సరి చేయాలని కోరారు. 50 మంది ఉపాధ్యాయులు దీక్షలో పాల్గొన్నారు. వీరికి మద్దతుగా 100 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు దీక్షలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య, ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటరావు, ఎన్.లక్ష్మీ నారాయణ, ఏపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునరావు, నాయకులు దిలీప్ చక్రవర్తి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు, బీటీఏ జిల్లా బాధ్యులు కుమారస్వామి, అశోక్‌బాబు, చిన్నస్వామి, మహిళా నాయకురాలు జి.ఉమామహేశ్వరి, ఎస్కే.బషీరున్నీసా, తదితరులు పాల్గొన్నారు.



నిరాహార దీక్షలో పాల్గొన్న ఉపాధ్యాయులు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


నాగూర్ బాషా(ఫైల్)

తాళ్లూరు: విద్యుదాఘానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన తాళ్లూరు మండలంలోని రాజానగరం గ్రామంలో ఆదివారం రాత్రి వెలుగు చూసింది. గ్రామ సర్పంచ్ షేక్ వలి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ అనీఫ్ కుమారుడు నాగూర్ బాషా(21) మసీద్‌పై క్యూరింగ్ చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులంతా సముద్ర స్నానాలకు వెళ్లారు. వారి వెంట నాగూర్ బాషా వెళ్లకపోవడంతో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వెంట ఉండి ఉంటాడని భావించారు. కానీ అక్కడా లేడని తెలియడంతో రాత్రి పొద్దుపోయే వరకు గాలించారు. చివరగా మసీద్‌పైకి వెళ్లి చూడగా అక్కడ విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సోమవారం గ్రామానికి చేరుకుని యువకుడి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, ఎంపీటీసీ మేడగం వెంకటరామిరెడ్డి, సర్పంచ్ షేక్ వలి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లోకిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.


యువకుడి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

బండ పందెంలో వైఎస్సార్ కడప గిత్తల సత్తా

రాచర్ల: మండలంలోని యడవల్లి గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో వైఎస్సార్ కడప జిల్లా ఎడ్ల జతలు తొలి రెండు బహుమతులు సాధించి సత్తా చాటాయి. వైఎస్సార్ జిల్లా చౌటపల్లి గ్రామానికి చెందిన మార్తాల చంద్ర ఓబుల్‌రెడ్డి ఎడ్లు నిర్ణీత 20 నిమిషాల్లో బండను 4 వేల అడుగులు లాగి మొదటి బహుమతి రూ.1,00,116ను, మరో ఎడ్ల జత 3,615 అడుగులు లాగి రెండో బహుమతి రూ.80 వేలు సొంతం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం గుప్రమానదిన్నె గ్రామానికి చెందిన కుందూరు రామ్‌భూపాల్‌రెడ్డి ఎడ్ల జత 3587 అడుగులు లాగి మూడో బహతి రూ.60 వేలు, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరయ్యస్వామి చౌదరి ఎడ్ల జత 3557 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ.40 వేలు, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీష చౌదరి ఎడ్ల జత 3455 అడుగులు లాగి ఐదో బహుమతి రూ.20 వేలు, నంద్యాల జిల్లా జిల్లెల గ్రామానికి చెందిన గౌటిక హేత్విక్‌రెడ్డి ఎడ్ల జత 3,383 అడుగులు లాగి ఆరో బహుమతి రూ.15 వేలు, అనంతపురం జిల్లా గార్లదిన్నె గ్రామానికి చెందిన కె.రామాంజనేయులు ఎడ్ల జత 3,344 అడుగులు లాగి ఏడో బహుమతి రూ.10 వేలు, వైఎస్సార్ జిల్లా పత్తూరు మండలం బాజీపేట గ్రామానికి చెందిన కవ్వ బాలయ్య ఎడ్ల జత 3,279 అడుగులు లాగి ఎనిమిదో బహుమతి రూ.5 వేలు పొందాయి. విజేతలకు ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

తెలుగు యువత డిష్యుం.. డిష్యుం!


గాయపడిన ప్రేమ్‌బాబు

యర్రగొండపాలెం: పుల్లలచెరువు మండలంలోని ఆర్.ఉమ్మడివరం గ్రామంలో తెలుగు యువత మధ్య ఆదివారం ఘర్షణ చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘర్షణలో వక్కమూడి ప్రేమ్‌బాబు తీవ్రంగా గాయపడి వై.పాలెంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. మరొక యువకుడు నెహెమియాకు కనిపించని గాయాలయ్యాయని తెలిసింది. క్రికెట్ ఆడే సమయంలో ఇరు జట్ల మధ్య ఘర్షణ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ముందుగా విద్యాసాగర్‌కు చెందిన టీం బ్యాటింగ్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రేమ్‌బాబు టీం తమకంటే ఎక్కువ స్కోర్ చేసి గెలుస్తుందన్న ఆలోచనతో విద్యాసాగర్ టీం వాగ్వివాదానికి దిగింది. వ్యవహారం చినికిచినికి గాలివానలా మారడంతో ఇరు జట్లు భౌతిక దాడులకు దిగాయి. ఇరుజట్లలో ఉన్న సభ్యులు టీడీపీ వర్గానికి చెందిన వారు కావడంతో ఈ దాడిని ఎవరూ పట్టించుకోలేదు. ప్రేమ్‌బాబు తలకు గాయం కావడం, చికిత్స నిమిత్తం వైద్యశాలలో చేరడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. ఇరు వర్గాలు అధికార పార్టీకి చెందినవారు కావడం వలన ఈ కేసును ఏ విధంగా టేకప్ చేయాలో తెలియక పోలీసులు సతమతమవుతున్నట్లు సమాచారం. దాడికి పాల్పడిన విద్యాసాగర్, సాయి, పవన్‌కుమార్‌లపై ప్రేమ్‌బాబు వర్గీయులు కేసు పెట్టినట్లు తెలిసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు.

పాలనలో కూటమి విఫలం


మాట్లాడుతున్న మేరుగు నాగార్జున, పక్కన చుండూరి తదితరులు

ఒంగోలు సిటీ: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి బాబు పేర్కొన్నారు. సోమవారం ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టారు. గడిచిన ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కూటమి ప్రభుత్వ కుటిల నీతిని అవలంబిస్తోందని విమర్శించారు. ప్రజలను రక్షించాల్సిన వ్యవస్థలే భక్షిస్తున్న తీరు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అమాయక ప్రజలపై భౌతిక దాడులు, మహిళలపై రోజూ జరుగుతున్న అఘాయిత్యాలు, చట్టాన్ని పాలకులు తమ చేతుల్లోకి తీసుకోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. వైఎస్సార్ సీపీ మీద, తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబం మీద నిత్యం విషం చిమ్ముతున్న కూటమి నాయకులు నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని నిప్పులు చెరిగారు.

టీవీ చర్చలో పాల్గొనడానికి వచ్చిన వ్యక్తి ఏదో మాట్లాడారని శ్రీనివాసరావుపై కేసు పెట్టి అరెస్ట్ చేయడం కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యకు నిదర్శమన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు సాక్షిలో పనిచేయడమే నేరమైనట్లుగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. చర్చలో అనుచితంగా మాట్లాడిన జర్నలిస్టును కొమ్మినేని శ్రీనివాసరావు వారించారని, సదరు జర్నలిస్టు సైతం పొరపాటు జరిగిందని క్షమాపణ కోరారని గుర్తుచేశారు. అయినప్పటికీ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేసి మీడియా గొంతు నొక్కాలని కూటమి ప్రభుత్వం భావించడం అవివేకమన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా విఫలమైందని కూటమి పాలనను ప్రజలు నిర్ద్వందంగా తిరస్కరిస్తున్నారని ఇటీవల కొన్ని సర్వేల్లో వెల్లడైన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయం మీద రాష్ట్ర ప్రజలు చర్చించుకుంటున్నారని, వారి దృష్టిని మరల్చేందుకే అరెస్ట్ నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. వెన్నుపోటు దినం ర్యాలీలు విజయవంతం కావడంతో కూటమి ప్రభుత్వం ఓర్చుకోలేకపోతోందన్నారు. ప్రజలు అమాయకులు కాదని, ప్రభుత్వం ఎన్ని గారడీలు చేసినా ప్రజల్లో క్రేజ్ రాదన్నారు. పొగాకు రైతుల సమస్యలు తెలుసుకుని, గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసేందుకు 11వ తేదీన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలికి వస్తున్నారన్నారు. రైతులందరూ హాజరై జగనన్న పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, మద్దిపాడు మండల పార్టీ ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, కందుల డానియేల్, వైఎస్సార్ సీపీ నాయకులు పోలినేని వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచన
- టెన్త్, ఇంటర్ విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు అందజేత


విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ఒంగోలు సిటీ: ప్రతి విద్యార్థి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేవరకు పట్టువిడవకుండా కృషి చేయాలని కలెక్టరు ఎ.తమీమ్‌అన్సారియా సూచించారు. సోమవారం ఒంగోలు నగర పరిధిలోని పెళ్లూరులో సాయిబాబా సెంట్రల్ స్కూల్లో ఏర్పాటు చేసిన షైనింగ్ స్టార్స్ అవార్డులు పంపిణీ చేశారు. జిల్లాలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 242 మంది, ఇంటర్‌లో సత్తా చాటిన 36 మంది విద్యార్థులను సత్కరించి, సర్టిఫికెట్, మెడల్, రూ.20 వేల నగదు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ.. షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి మండలం నుంచి అత్యధిక మార్కులు పొందిన ఆరుగురిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల సామర్థ్యాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఒంగోలు, సంతనూతలపాడు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్‌రావు, బీఎన్ విజయకుమార్, ఆర్ఐఓ సైమన్ విక్టర్, డీఈఓ కిరణ్ కుమార్, మేయర్ సుజాత, ఏపీ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై నారసింహుడు


శేషవాహనంపై దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి


పందెంలో తలపడుతున్న పొట్టేళ్లు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా మహిళలు మెట్ల పూజ నిర్వహించి మొక్కులు చెల్లించారు. మంగళవారం హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని, శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పందేలు

వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం సాయంత్రం శ్రీకృష్ణ యాదవ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పొట్టేళ్ల పందేలు హోరాహోరీగా సాగాయి. పోటీలో ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన 12 పొట్టేళ్లు పాల్గొన్నాయి. సంతనూతలపాడు మండలం ఎనికెపాడు గ్రామానికి చెందిన యద్దనపూడి శ్రీనివాస్ పొట్టేలు మొదటి బహుమతి రూ.25 వేలు, బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామానికి చెందిన మేదరమెట్ల రవి పొట్టేలు ద్వితీయ బహుమతి రూ.20 వేలు, అద్దంకి మండలం పాటికలపూడి గ్రామానికి చెందిన మారుబోయిన దుర్గాప్రసాద్ పొట్టేలు తృతీయ బహుమతి రూ.15 వేలు, రేణంగివరం గ్రామానికి చెందిన అర్రిబోయిన రామారావు పొట్టేలు నాలుగో బహుమతి రూ.10 వేలు సాధించాయి. పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలిరాగా, ఎస్సై బి.మహేంద్ర తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నష్టపరిహారం కోసం బాధితుల ఆందోళన

- పోలీసులకు, బాధితులకు మధ్య వాగ్వివాదం

సింగరాయకొండ: ఒక్కగానొక్క కొడుకు చనిపోయాడు, ఆ కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించాలంటూ ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పొట్లేళ్ల జగదీష్‌కుమార్ బంధువులు, స్నేహితులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఎస్సై బి.మహేంద్రను డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో పోలీసులకు, బాధితులకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటకు కారణమైన వ్యక్తిని పట్టుకునే క్రమంలో ఇద్దరు పోలీసులకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. రోడ్డు ప్రమాదానికి కారకుడైన ఉలవపాడు మండలం మన్నేటికోట గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వంకాయల పాటి కోటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడిన జనం

మద్దిరాల యల్లమ్మతల్లి గుడిలో చోరీ

- అమ్మవారి ఆభరణాలు అపహరించిన దుండగులు


దుండగులు పగలగొట్టిన హుండీ

పీసీపల్లి: గుడి తాళాలు పగలగొట్టి అమ్మవారి ఆభరణాలు, హుండీలో కానుకలను దుండగులు కొల్లగొట్టారు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి పీసీ మండలంలోని వెంగలాయపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. వెంగలాయపల్లి గ్రామంలోని మద్దిరాల యల్లమ్మతల్లి గుడిలోకి ఆదివారం అర్ధరాత్రి ప్రవేశించిన దుండగులు అమ్మవారి మూలవిగ్రహమూర్తికి అలంకరించిన 50 గ్రాముల బంగారు, వెండి ఆభరణాలతోపాటు హుండీలోని రూ.10 వేల నగదు చోరీ చేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని ఎస్సై కోటయ్య తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామంలో తిరునాళ్ల నిర్వహించిన వెంటనే అమ్మవారి ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

విశాఖ ఉక్కు కోసం ప్రాణ త్యాగాలకైనా సిద్ధం


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మిక కర్షక నాయకులు

ఒంగోలు టౌన్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుని తీరతామని, అవసరమైతే ప్రాణ త్యాగాలు చేయడానికైనా వెనకాడేది లేదని సంయుక్త కిసాన్ రైతు మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పేర్కొన్నారు. కార్మిక, కర్షక, ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కును రక్షించాలనే నినాదంతో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేసేది లేదని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భరోసా ఇచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చాప కింద నీరులా కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఐదు వేల మంది కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించి, మూడు మాసాల నుంచి వేతనం ఇవ్వకుండా వేధిస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్‌చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం 1553 రోజుల నుంచి నిరాహార దీక్షలు కొనసాగుతుంటే స్పందించని రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి దీక్షా శిబిరాన్ని భగ్నం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎంఎస్ సాయి మాట్లాడుతూ.. మిట్టల్ కంపెనీకి సర్వ సౌకర్యాలు, రాయితీలు కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ఊపిరి తీసే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.కల్పన, రైతు, కార్మిక సంఘాల నాయకులు జీవీ కొండారెడ్డి, హనుమంతరావు, రాజశేఖర్, తంబి శ్రీనివాసరావు, ఎంఏ సాలార్, సయ్యద్ మున్నా, బివి రావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్ సప్లి ఫలితాల్లో 'వివేకానంద' సత్తా


తహేరా ఫాతిమా


నందిని

పొదిలి రూరల్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో పొదిలి వివేకానంద జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తాచాటారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం బైపీసీలో మహ్మద్ తహేరా ఫాతిమా 440 మార్కులకు గాను 437 సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని యాజమాన్యం తెలిపింది. ఎస్‌కే బుష్రా 440కు 433, అక్ష 440కు 432 మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో డి.నందిని 470కుగాను 465 మార్కులతో రాష్ట్రంలో 4వ స్థానంలో నిలిచింది. విద్యార్థులను కాలేజీ యాజమాన్యం అభినందించింది.

నేటి నుంచి తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలు


తిరుమలనాథస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారు

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల పంచాయతీ పరిధిలోని రాజంపల్లి గ్రామ సమీపంలో కొలువైన గొడ్రాలి కొండ తిరుమలనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి(తెల్లవారితే బుధవారం) ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కల్యాణం, 11న సింహ వాహనం, 12న శేష వాహనం, 13న హనుమంత వాహనం, 14న గరుడ వాహనం, 15న గజ వాహనం, 16వ తేదీ సాయంత్రం రథోత్సవం, 17న అశ్వ వాహనం, 18న హంస వాహనం, 19వ తేదీ సాయంత్రం రాజంపల్లిలో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి ఆలయం వద్ద సంతానం లేని దంపతులకు గరుడ ప్రసాదం పంపిణీ చేయనున్నారు.


ముప్పాళ్ల మద్దిరాల రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

రైతులంతా పొదిలి తరలిరావాలి

- రేపు వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలి
- పొగాకు రైతులకు మద్దతుగా నిలవాలి
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: పొగాకు రైతుల నడ్డివిరిచిన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించి రైతుల పక్షాన పోరాటం చేసేందుకు ఈ నెల 11వ తేదీ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పొదిలి రానున్నారని, పార్టీలకు అతీతంగా రైతులంతా పొదిలి చేరుకుని జగన్ పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. పొగాకు రైతుల కోసం పొదిలిలోని పొగాకు బోర్డుకు వస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన, అక్కడ చేపట్టనున్న ధర్నా కార్యక్రమాలపై సోమవారం నాగులుప్పలపాడు మండలంలోని ముప్పాళ్ల మద్దిరాల గ్రామాల రైతులతో మేరుగు నాగార్జున ప్రత్యేక సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో మేరుగు నాగార్జున మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పొగాకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను పొగాకు బోర్డు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏమాత్రం రేట్లు లేకుండానే వ్యాపారులకు దోచిపెడుతున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంట సాగు ఖర్చులు, కూలీల రేట్లు, తదితరాలన్నీ పెరిగిపోయాయని, కానీ, క్వింటా రూ.15 వేల నుంచి రూ.20 వేల మధ్యలో కొనుగోలు చేస్తే రైతాంగం అప్పులెలా తీర్చాలని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గిట్టుబాటు ధరలకు పొగాకు బోర్డు కొనుగోలు చేయని సమయంలో నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి క్వింటా రూ.30 వేల వరకు కొనుగోలు చేసిన విషయాన్ని మేరుగు నాగార్జున గుర్తుచేశారు. ప్రస్తుతం పొగాకు రైతుల బాధలు చూసి చలించిన జగనన్న వారికి అండగా నిలిచి ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు పొదిలి వస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ఓటేసి మోసపోయిన పొగాకు రైతులు, ఇతర రైతులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నలమలపు కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు పోలినేని కోటేశ్వరరావు, కోటిరెడ్డి, బీసీ సెల్ మండలాధ్యక్షుడు పొదర్తి శివ, రైతు విభాగం మండలాధ్యక్షుడు తగిరిశ సుబ్బారావు, మండల ఉపాధ్యక్షుడు కాటూరి ఆదియ్య, కందుల దానియేలు, జెట్టి చెన్నకేశవులు, ఘట్టమనేని అశోక్, పొద పవన్, మారెళ్ల శ్రీనివాసరావు, వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో రూ.5.50 లక్షలకు టోకరా


మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్


పోలీస్ గ్రీవెన్స్‌కు హాజరైన బాధితులు

- ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు
- పోలీస్ గ్రీవెన్స్‌కు 71 ఫిర్యాదులు

ఒంగోలు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పేర్నమిట్ట గ్రామానికి చెందిన ఒక వ్యక్తి 5.50 లక్షల రుపాయలు తీసుకుని మోసం చేసినట్లు పొదిలికి చెందిన ఒక యువకుడు ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కలిసిన బాధితుడు తనకు జరిగిన మోసాన్ని వివరించాడు. డబ్బు వసూలు చేసిన సదరు మోసగాడు తమ మెయిల్‌కు ఫేక్ ఆఫర్ లెటర్ పంపించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే మద్రిపూడికి చెందిన ఒక మహిళ తన ఇంటిని తాకట్టు పెట్టి ఒక ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ దగ్గర 4 లక్షల రుపాయలు రుణం తీసుకొంది. ప్రతి నెలా 11,500 రుపాయల ఈఎంఐ చెల్లిస్తోంది. అయితే కంపెనీ తరపున డబ్బు వసూలు చేస్తున్న వ్యక్తి మధ్యలో ఉద్యోగం మానేశాడు. ఆ విషయాన్ని దాచిపెట్టి ప్రతి నెలా ఈఎంఐ వసూలు చేసుకొని వెళ్తున్నాడు. తన వద్ద వసూలు చేసిన డబ్బును కంపెనీకి చెల్లించకుండా మోసం చేసినట్లు తెలుసుకున్న సదరు మహిళ ఎస్పీ ఎదుట తన గోడు వెళ్లబోసుకుంది.

ఒంగోలుకు చెందిన ఒక వ్యక్తి గుంటూరుకు చెందిన వ్యక్తి దగ్గర 19 వేల రుపాయలకు ఆపిల్ వాచ్ కొనుగోలు చేశారు. వాచ్ కొన్న తరువాత రిపేర్‌లో ఉన్నట్లు తెలిసింది. దానికి సంబంధించిన డాక్యుమెంట్లు అడుగుతుంటే ఇవ్వడం లేదని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇలా మొత్తం 71 ఫిర్యాదులు పోలీస్ గ్రీవెన్స్‌కు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పేవారిని నమ్మి మోసపోవద్దని యువతకు సూచించారు. ఏదైనా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయాలని చెప్పారు. బాధితుల ఫిర్యాదులను చట్టపరంగా పరిశీలించి తగిన న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ రమణ కుమార్, సీసీఎస్ సీఐ జగదీష్, ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ దుర్గా ప్రసాద్, టీడీసీ సీఐ షమీముల్లా, ప్రజా సమస్యల వేదిక ఎస్సై జనార్ధన్ రావు తదితరులు పాల్గొన్నారు.